క్లుప్తంగా

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీవో

జగిత్యాలరూరల్: పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో రవిబాబు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో శనివారం పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సరఫరాతో పాటు, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరీటి, కారోబార్ రాజిరెడ్డి, ఆశా వర్కర్లు పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులను నాస్ పరీక్షకు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి రాజేశ్

బుగ్గారం: జాతీయ సాధన సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని సమగ్రశిక్ష జిల్లా సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేశ్ సూచించారు.ఈ మేరకు శనివారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల సముదాయ సమావేశాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఆశించిన అభ్యసనా సామర్థ్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మోహన్‌రెడ్డి, సబ్జెక్టు రిసోర్స్ పర్సన్స్ విజయ్‌కుమార్, సతీశ్‌రావు, రాజేష్, తిరుపతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీ



హోటళ్లలో పదార్థాలు పరిశీలిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్లలో శనివారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి జరిమానా విధించారు. అలాగే వారికి పలు సూచనలు చేశారు. చట్నీలతో పాటు ఇతర పదార్థాల పార్సళ్ల కోసం ప్లాస్టిక్ కవర్ల వినియోగించవద్దన్నారు. పరిశుభ్రత పాటించాలని, మరిగిన నూనెను పదేపదే వాడవద్దని సూచించారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, అశోక్, నిజాం పాల్గొన్నారు.

హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్/కోరుట్ల: హైడ్రా తరహా వ్యవస్థను జగిత్యాల జిల్లాలో అమలు చేసిన చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువలు, శిఖం భూములు, బఫర్ జోన్ల పరిధిలో ఆక్రమణలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో చెన్న విశ్వనాథం, బట్టు సుదర్శన్ పాల్గొన్నారు.

దళితులకు రిజర్వేషన్ అమలు చేయాలి

జగిత్యాల: ప్రైవేట్ రంగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని, ఎస్సీ ఇండస్ట్రీ సబ్సిడీ నిధులను విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మంతు, ఉపాధ్యక్షులుగా సురేశ్, రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా రాజు, రాజయ్య, లక్ష్మీరాజంలను ఎన్నుకున్నారు.

రహదారులు, చెరువుల మరమ్మతు చేయండి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు చోట్ల రహదారులు, చెరువు మత్తళ్లు, కట్టలు, వంతెనలు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన జీవోను అనుసరించి వీటిని వెనువెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సంబంధిత శాఖల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అవయవదానం ఎంతో గొప్పది

సృష్టిలో అవయవదానం ఎంతో గొప్పదని, మరొకరికి జీవితం ఇస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 36వ వార్డుకు చెందిన పొన్నం నారాయణగౌడ్ (86) మరణానంతరం తన దేహాన్ని జగిత్యాల మెడికల్ కళాశాలకు అందిస్తానని డిక్లరేషన్ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జ్యోతి, టీవీ.సత్యం ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం

జగిత్యాలటౌన్: క్రీడలతో స్నేహభావం, మానసిక ఉల్లాసం కలుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

జగిత్యాలటౌన్: శ్రీ దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించబోయే దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

భగీరథతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

• కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: మిషన్ భగీరథతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ పనుల వల్ల వార్డుల్లో రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయని. వీటివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. అలాగే భగీరథ పైపులైన్ ఉన్నప్పటికీ.. చాలా చోట్ల ఇంకా ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మొత్తం 22అంశాలు ప్రవేశపెట్టగా, వీటికి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీ నిధులు రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మల్లాపూర్, ముత్యంపేట, చిట్టాపూర్, గుండంపల్లి, సాతారం గ్రామాల్లో శనివారం పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

జీవో నంబర్ 25 రద్దు చేయాలని నిరసన



రాయికల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

రాయికల్: సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరుతూ రాయికల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దొంతి సతీశ్, మండల అధ్యక్షుడు గంగరాజం, నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను రద్దు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుని చొప్పున నియమించాలని డిమాండ్ చేస్తూ యూఎస్పీసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ఆగమయ్య, మల్లికార్జున్, పద్మనాభం, రవీందర్, గంగరాజు,తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: జీవో 25ను రద్దు చేయాలని కోరుతూ సారంగాపూర్ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పీసీఎస్ విధానరం రద్దు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఈడీ చేసిన వారికి పీఎస్ హెచ్ఎం పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేదాకా పోరాటాలు ఆగవు



మాట్లాడుతున్న పన్నాల తిరుపతిరెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక పోరాటాలు ఆగవని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గుడేటి కాపు సంఘ భవనంలో శనివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ రుణమాఫీ కాలేదని ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, రైతు భరోసా అందించాలని కోరారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. వచ్చే నెల 4న కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలని కోరారు. జిల్లా రైతు ఐక్య వేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్ మాట్లాడుతూ చలో కలక్టరేట్ ముట్టడిలో రైతులందరూ పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ పవన్, రైతులు చిన్నారెడ్డి, తీగల శ్రీధర్‌రెడ్డి, అబ్బిడి రాజారెడ్డి, గుజ్జుల నర్సారెడ్డి, సత్యనారాయణ, పాల్గొన్నారు.

కథలాపూర్: అర్హులైన రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ వచ్చేవరకు ఉద్యమిద్దామని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, చింతకుంట, పోసానిపేట, తాండ్ర్యాల గ్రామాల్లో శనివారం పర్యటించి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు పంట రుణం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సీబీపీ సేవలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: ప్రభుత్వ ఆస్పత్రిలో సీబీపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సీబీపీ సేవలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షల రిపోర్టులు అరగంటలో ఇస్తారని తెలిపారు. పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డిని పలువురు అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ వస్తువుల పంపిణీ

మున్సిపల్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం సేఫ్టీ వస్తువులు హెల్మెట్, మాస్క్, గ్లౌజ్, బూట్లను మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అందజేశారు. కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వయోవృద్ధుల పోషణ భారం పిల్లలదే

జగిత్యాల: వయోవృద్ధుల పోషణ భారం పిల్లలదేనని సఖీ లీగల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని పోషణ, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007కు ముందు హిందు దత్త పోషణ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణభారం పిల్లలదేనన్నారు. వారిని నిరాదారణకు గురిచేస్తే చర్యలుంటాయన్నారు. సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, మహిళ సాధికారిత కో–ఆర్డినేటర్ అశ్విని పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో జంబికొట్టె స్థలం వద్ద మురికి కాలువ నిర్మాణానికి రూ.1.5 లక్షల నిధులు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మంజూరు చేయగా, మంజూరు పత్రాలను శనివారం ఇబ్రహీంపట్నంలో వేములకుర్తి గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులకు మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దూదిగాం గంగాధర్, కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి తరి రామానుజం, వేములకుర్తి వీడీసీ చైర్మన్ ఎడపెల్లి గంగారెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి

కొండగట్టు: కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఫాలోజు కుమారస్వామి తనకు ఏడు నెలల జీతం రావాలని, వెంటనే ఇప్పించాలని తహసీల్దార్ గుగ్గిల్ల రమేశ్ శనివారం వినతిపత్రం అందజేశారు.

మండల అధ్యక్షుడి నియామకం చెల్లదు

మల్లాపూర్: కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడి నియామకం చెల్లదని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుల నియామకం జిల్లా అధ్యక్షుడి ద్వారానే జరుగుతుందన్నారు. రెండు రోజుల క్రితం మండల అధ్యక్షుడికి, ఉపాధ్యక్షుడికి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిట అందజేసిన నియామక పత్రాలు చెల్లవని, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘిస్తే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. త్వరలోనే మల్లాపూర్ బీసీ సెల్ మండల కమిటీని నియమిస్తామని తెలిపారు.

పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు తప్పనిసరి

మెట్‌పల్లిరూరల్: పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు తప్పసరిగా వేయించాలని పశువైద్య,పశుసంవర్ధక జిల్లా అధికారి మనోహర్ అన్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో శనివారం రేబీస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య కేంద్రంలో ఉచిత యాంటీ రేబీస్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి, పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి మనీషా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ రేబీస్ వ్యాధి నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్,పాఠశాల హెచ్ఎం ప్రవీణ్,ఉపాధ్యాయులు,పశువైద్య సిబ్బంది ,గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

బుగ్గారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. జగిత్యాలకు చెందిన ఏవీపీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డా.శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బాలబాలికలకు ఏడాదిపాటు ఉచితంగా దంత వైద్య సేవలు నిర్వహించడానికి ప్రత్యేకమైన కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్నాడి మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ పురుషోత్తం సామాజిక కార్యకర్త చుక్క గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఉదయం నారింజ రంగులో.. సాయంత్రం లేత బూడిద వర్ణంలో ఆకాశం

ఆకాశంలో అద్భుతం

కోరుట్ల: ప్రకృతిని మించిన చిత్రకారుడు లేదు. శనివారం కోరుట్లలో సూర్యోదయం, సూర్యాస్తమయం తీరు అద్భుతమనిపించింది. ఉదయం 5.47 గంటలకు సూర్యప్రకాశంతో ఆకాశం ఎరుపు, నారింజ రంగులో కనిపించింది. సాయంత్రం సరిగ్గా 5.47గంటలకు అలసిన సూరీడు లేత బూడిద రంగులో కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



ధర్మపురి: అసలే ఇరుకు రోడ్డు ఆపై చిరువ్యాపారుల సందడి. రోడ్డుకు ఇరువైపులా పెట్టిన సామగ్రితో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎర్పడ్డాయి. ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయం ముందు భాగంలో రోడ్డు ఇరుకుగా ఉంది. చిరు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా కొబ్బరికాయలు, దేవుళ్ల ఫోటోలు, ఇతర వస్తువులు పెట్టడంతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్(ఈవో,ధర్మపురి) సెల్: 9440369544

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

సంక్షిప్త వార్తలు

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈఓ రామకృష్ణారావు, ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ హరిహరనాథ్ పర్యవేక్షించారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో కథలాపూర్‌కు ద్వితీయ స్థానం

కథలాపూర్: జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో కథలాపూర్ మండల బాలికల జట్టు ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు పీఈటీ మగ్గిపెల్లి నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. వారం క్రితం మండలస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశామని పీఈటీలు తెలిపారు. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంపై మండలంలోని పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంఈవోకు సన్మానం

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 చదువుకున్న రాఘవులు ఇటీవల మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించగా శనివారం పాఠశాల పూర్వ విద్యార్థి, ఎంఈవో రాఘవులును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలోఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుగ్గారం: మండల విద్యాధికారిగా నియమితులైన సురోజు వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు,ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మోహన్‌రెడ్డి, మధుకర్‌రావు, రాజశేఖర్,చంద్రశేఖర్‌రెడ్డి,సీఆర్‌పీ పురుషోత్తం పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలలో క్రీడాకారుల ప్రతిభ

వెల్గటూర్ : ఎస్‌జీఎఫ్ అండర్ –14 జిల్లా స్థాయి పోటీల్లో వెల్గటూర్ అండర్ –14 జట్టు ధర్మపురి అండర్ –14 జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులను వెలగటూర్ ఎంఈవో బోనగిరి ప్రభాకర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీలు సబ్బు జగన్, మహేశ్, రాజ్‌కుమార్, కృష్ణవేణి, గంగాధర్, కన్వీనర్ భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తారకేశ్వరస్వామిని దర్శించుకున్న కమలానంద భారతిస్వామి

కథలాపూర్: మండలంలోని చింతకుంట శ్రీ తారకేశ్వరస్వామిని భువనేశ్వరి పీఠం శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి శనివారం ఉదయం దర్శించుకున్నారు. కమలానంద భారతి స్వామికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని స్ఫటిక లింగానికి అభిషేకం నిర్వహించారు. స్వామివారిని అర్చకులు, భక్తులు శాలువాలతో సన్మానించారు.

కొత్తపల్లి శివారు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: మండలంలోని లచ్చనాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి తండాను ప్రంచాయతీగా ఏర్పాటు చేయాలని శనివారం కొత్తపల్లి తండా వాసులు ప్రత్యేకాధికారి డెప్యూటీ తహసీల్దార్ లాస్యకు వినతిపత్రం అందజేశారు.

బాలసదన్ నుంచి బాలిక అదృశ్యం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భీష్మనగర్ బాలసదన్‌లో ఉంటున్న 17 ఏళ్ల బాలిక శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అదృశ్యమైంది. దీంతో వెంటనే బాలసదన్ నిర్వాహకులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు. కాగా, అదృశ్యమైన బాలిక జిల్లా కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గత కొద్దిరోజులుగా బాలిక ఆస్తమా, స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్నట్లు సమాచారం.

రైతు ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా అనిల్

ఇబ్రహీంపట్నం: రైతు ఐక్యవేదిక మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఆకుల అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గుడేటి కాపు సంఘ భవనంలో రైతులు సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ తెలిపారు. అనిల్‌ను రైతు వేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌లు సన్మానించి అభినందించారు.

అండర్ – 14 కబడ్డీ జట్టుకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల: జిల్లాస్థాయి కబడీ సెలక్షన్స్‌లో చైతన్య పాఠశాల విద్యార్థి హర్షిత్ జిల్లా టీం సభ్యునిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణచందర్ రెడ్డి విద్యార్థిని అభినందించారు.

వరల్డ్ రికార్డ్ కోసం సీడ్ బాల్స్ తయారీ

కోరుట్ల: వరల్డ్ రికార్డ్ కోసం వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో కోటి విత్తనాలతో కూడిన బాల్స్ తయారీ చేశారు. వారు తయారు చేసిన మొత్తం 18వేల సీడ్‌బాల్స్‌ను రీజినల్ ఇన్‌చార్జి, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ మానుక రాజేంద్ర ప్రసాద్, కొత్త సునీల్, నీలి లక్ష్మీ శనివారం పరిశీలించారు. వాసవీ వనితా క్లబ్ సభ్యులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు భూస మాధురి, కార్యదర్శి వెలుగురు భాగ్య, ఆర్య వైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలి

జగిత్యాల: విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ అన్నారు. శనివారం మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆధునిక కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ఆదర్శంగా తీసుకుని ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య, కరీంనగర్ ప్రిన్సిపల్ వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

నీటి సరఫరా సహాయకులకు శిక్షణ

సారంగాపూర్: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సరఫరా సక్రమంగా జరగడానికి నీటి సరఫరా సహాయకులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు సారంగాపూర్ ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నీటి సహాయకులకు అందించే నాలుగు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈలు రామారావు, జలేందర్‌రెడ్డి, ఎంపీవోలు శశికుమార్‌రెడ్డి, ఏవీకే రాజు, ఏఈ రాజేందర్ పాల్గొన్నారు.

బుగ్గారం: గ్రామాలలోని ప్రజలకు సురక్షితమైన మంచినీటిని నిరంతరాయంగా అందించడానికి, నీటి సరఫరాలో ఆటంకాలు లేకుండా,సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చడానికి గ్రామాలలో పనిచేస్తున్న మంచినీటి సహాయకులకు అందించిన ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని బుగ్గారం,ధర్మపురి మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వివేకానందన అన్నారు. కార్యక్రమంలో డీఈఈలు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామీణ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్లంబింగ్, పైప్‌లైన్ మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ రమేశ్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మ, ఏఈఈలు పాల్గొన్నారు.